ఈ-పంట.. రైతుకు లాభమంట..

- ముమ్మరంగా నమోదు ప్రక్రియ
- పంట ఆధారంగానే నష్ట పరిహారం
- రైతుకు ప్రయోజనమంటున్న అధికారులు

రాయవరం: ఆరుగాలం కష్టపడుతున్న రైతులకు ఎదురయ్యే కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలుస్తోంది. తరచూ సంభవించే ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న రైతులకు ఈ-క్రాప్ అండగా నిలుస్తోంది. రైతులకు అన్ని విధాలుగా మేలు చేకూర్చే ఈ-పంట విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోంది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు రబీ ఈ-క్రాప్ నమోదులో నిమగ్నమయ్యారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో ఈ-పంట నమోదు ముమ్మరంగా సాగుతోంది. సాగుభూమి విస్తీర్ణం ఎంత? ఎవరు సాగు చేస్తున్నారు? ఏ పంటలను పండిస్తునానరనే సమాచారాన్ని విడివిడిగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పంట సాగు చేసిన తరువాత ప్రతి రైతూ ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 45 శాతం ఈ-పంట నమోదైంది.

చురుగ్గా నమోదు ప్రక్రియ

క్లస్టర్ పరిధిలో ఈ-పంట నమోదు చురుగ్గా సాగుతోంది. పంట నష్టం ఏర్పడినప్పుడు సులభంగా నష్టాన్ని అంచనా వేయడానికి, పరిహారాన్ని రైతులకు మాత్రమే అందించేందుకు ఈ-పంట విధానం ఎంతో ఉపకరిస్తోంది. గ్రామాల్లో ఉండే అన్ని పంటలు, భూముల వివరాలను తెలుసుకునేందుకు ఈ-క్రాప్ ఉపయోగ పడుతుందని అధికారులు చెబుతున్నారు. క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో 99,235 ఎకరాల్లో వరిసాగును రైతులు చేపడుతున్నారు. వరి ఇతర పంటలు కేవలం నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో పూర్తిగా కాలువలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. వరితో పాటు అరటి, కొబ్బరి, చెరకు పంటలు సాగవుతున్నాయి.

ప్రయోజనాలివీ

ప్రస్తుతం వేసిన పంటలు నమోదు చేసుకోవడం వల్ల గ్రామ విస్తీర్ణం, మండల విస్తీర్ణం, ఏయే పంటలు సాగు చేసారో తెలుస్తోంది. ఈ-పంట నమోదుతో ఏ జిల్లాలో, ఏ మండలంలో, ఏ పంట ఎంత ఉత్పత్తి అవుతుందో గణాంకాలు సులువుగా తెలుసుకోవచ్చు.

వర్షాభావం/అధిక వర్షాలు వంటి పరిస్థితుల్లో ఏయే పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఎంత నష్టపోయారు. అనే విషయాలు క్లుప్తంగా ఉంటాయి. మద్దతు ధరతో పంట దిగుబడులను కొనుగోలు చేసేటప్పుడు ఎటువంటి సమస్య లేకుండా పంట సాగు ధృవీకరణ పత్రం పొందేందుకు వీలుంటుంది.



ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఈ నెల 25 నాటికి ఈ-క్రాప్ నమోదు ఇలా

మండలం	సాగు విస్తీర్ణం	ఈ-పంట నమోదు
రాయవరం	14,550	7595
కె.గంగవరం	15657	7207
కపిలేశ్వరపురం	15802	4732
రామచంద్రపురం	18,219	8773
మండపేట	16447	7648
కాజులూరు	18560	8685
మొత్తం	99235	44640

అవగాహన పెంచుతున్నాం



ఈ-పంట నమోదును రైతులు వేగవంతం చేయాలి. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పంట నమోదును క్షేత్ర స్థాయిలో వేగవంతం చేసేందుకు రైతులను చైతన్యవంతం చేస్తున్నాం. రైతుల్లో కూడా అవగాహన పెరిగింది. భూసార పరీక్ష పంటకు ఏవిధంగా రక్షణ ఇస్తుందో, ఈ-పంట నమోదు వల్ల రైతులకు అన్ని ప్రయోజనాలు ఉన్నాయి. పంట సాగు చేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు మధ్యలో పంట అతివృష్టి, అనావృష్టికి గురైతే నమోదు ఆధారంగానే నష్ట పరిహారం అందుతుందన్న విషయాన్ని రైతులు గమనించారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం మండలం

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కపిలేశ్వరపురం: పాఠశాల విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని టేకిలోని జోసఫ్ వీరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని 8వ జెడ్పీ, 6 యూపీ ప్రభుత్వ పాఠశాల్లలోని 445 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఎమ్మెల్సీ తోట చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ కృషిని పాఠశాల అభివృద్ధి కాంక్షితురాలు వీరవల్లి జోసఫ్ విల్లియం ఫ్లొరెన్స్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుక్కల బాలయ్య ప్రశంసించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ విద్యార్థిలో నైపుణ్యతను పెంపొందించేందుకు బైజూస్ కంటెంట్ దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను పెంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా ట్యాబ్‌లను అందిస్తుంటే పిల్లలను పాడు చేస్తున్నాడంటూ ప్రతిపక్ష నాయకులు ప్రచారం చేయడంపై ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.తాతారావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ టి.సురేష్, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: ఆప్తులను కోల్పోయి బాధపడుతున్న పలువురుని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం పరామర్శించారు. పితృవియోగంతో బాధపడుతున్న అంగర గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు కందుకూరి సత్యంను, భార్య వియోగంతో బాధపడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకుడు కాళ్ళకూరి సూర్యభాస్కరరావును పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, చేనేత సహకార సంఘం చైర్మన్ గుడిమెట్ల రాంబాబు, మాజీ సర్పంచ్‌లు, వంగా శ్రీనివాస్, సంకాబత్తుల స్వామికాపు, నాయకులు పసలపూడి శ్రీనివాస్, షేక్ రెహమాన్ ఉన్నారు.

కమలారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ

రాయవరం: గుండె శస్త్ర చికిత్స చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్న రాయవరం వైఎస్సార్ సీపీ నేత పడాల కమలారెడ్డిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం పరామర్శించారు. ఆరోగ్య, క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులతో పాటుగా మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బారామారెడ్డి, కేవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తేతల నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కమలారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

జగన్ పాలనలో ప్రజలు సురక్షితం

- వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్
- మాచవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజలంతా సురక్షితంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. మండలంలోని మాచవరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ పలివెల శోభన, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కాశీఈశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి చంటిబాబు, పడాల శ్రీనివాసరెడ్డి, మేడపాటి వెంకటరెడ్డి, మేడపాటి బసివిరెడ్డి, కొవ్వూరి అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్

'నాడు సిద్ధం.. నేడు సిద్ధం' విజయవంతం చేయండి

నియోజకవర్గ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఏలూరులో ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే నాడు సిద్ధం, నేడు సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పిలుపు నిచ్చారు. పార్టీ పట్టణ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్లో రామచంద్రపురం అర్బన్, రూరల్ పార్టీ ముఖ్యనేతల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టబోయే నాడు సిద్ధం.. నేడు సిద్ధం కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఇన్‌చార్జిలు నియోజకవర్గం నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకుడు పోలినాటి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మేర్నిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, రాష్ట్ర లీగల్‌సెల్ ప్రతినిధి మాగాపు అమ్మిరాజు, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్, సచివాలయ ఇన్చార్జిలు పాల్గొన్నారు.



ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త సూర్యప్రకాశ్

భారత రాజ్యాంగం దేశ ఔన్నత్యాన్ని చాటుతుంది

కపిలేశ్వరపురం: భారత రాజ్యాంగ యావత్‌భారత దేశ ఔన్నత్యాన్ని చాటుతుందని జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని అంగర, వల్లూరు, తాతపూడి, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అనుబంధ శాఖలు ఆధ్వర్యంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు వద్ద సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల పరిషత్ కార్యాలయ పాలనాధికారి ఎంవీ ప్రకాష్, గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అంగరలో సీనియర్ సిటిజన్‌ను సత్కరిస్తున్న అధికారులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

కపిలేశ్వరపురం (మండపేట): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మండపేటలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సంఘ నాయకులు దేవళ్ల సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు, కోశాధికారి ఎంబీవీఎల్ నరసింహం మాట్లాడుతూ పలు డిమాండ్లను ప్రస్తావించారు. వారికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మద్దతుగా శిబిరంలో సంఘీభావం తెలిపారు.

కాజులూరు: తమ డిమాండ్ల పరిష్కారానికి పెన్షనర్ల సంఘ సభ్యులు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కరప, కాజులూరు మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవు సదానందమూర్తి ఆధ్వర్యంలో కొద్దిసేపు ధర్నా చేసి, అనంతరం తహసీల్దారు బి.సాయిసత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డీవీఎస్ చిన్నారావు, పెంకే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ లెక్చరర్‌కు లెఫ్టినెంట్ కమాండర్ హోదా

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్‌సీసీలో 28ఏళ్ల విశేష సేవలందించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కరుటూరి శ్రీనివాసరావుకు లెఫ్టినెంట్ కమాండర్ హోదా ప్రదానం చేశారు. సెంట్రల్ గెజిట్ ఆఫ్ ఇండియా ద్వారా 6వ ఆంధ్ర నావెల్ యూనిట్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ అక్షయ్ అరుణ్ చేతుల మీదుగా ఈ హోదాను అందుకున్నట్టు గురువారం శ్రీనివాసరావు తెలిపారు. లెఫ్టినెంట్ కమాండర్ హోదా పొందడం ద్వారా అధికారిక ఆర్మ్‌డ్ ఫోర్సెస్, నావెల్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌లకు చెందిన అధికారిక కార్యక్రమాల్లో సంబంధిత యూనిఫాంతో పాల్గొని గౌరవ వందనాన్ని పొందే అవకాశం దక్కిందన్నారు. శ్రీనివాసరావుకు కళాశాల సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



లెఫ్టినెంట్ కమాండర్ హోదాను అందుకుంటున్న శ్రీనివాసరావు

జాతీయ స్థాయి పోటీలకు గొల్లపాలెం విద్యార్థిని



అక్షయప్రియను అభినందిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కాజులూరు: జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పలివెల అక్షయ ప్రియ ఎంపికైంది. ఈ మేరకు గురువారం పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం పి.సుశీలమణి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. స్కూల్ పీడీ జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ నవంబరు 19 నుంచి 21 వరకూ నంద్యాల జిల్లా నందికొట్కూరులో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు అక్షయప్రియ కెప్టెన్‌గా వ్యవహరించి, జట్టు విజయానికి కీలకపాత్ర పోషించడంతో ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సాధించిందన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటి వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో అక్షయప్రియ రాష్ట్ర జట్టు తరపున పోటీ పడనుందన్నారు. జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు తదితరులు అక్షయప్రియను అభినందించారు.

ఆర్డీఓ సుధాసాగర్‌కు ప్రజాహిత పురస్కారం



ఆర్డీఓ సుధాసాగర్‌కు పురస్కారాన్ని అందిస్తున్న జీవీ రావు

రామచంద్రపురం: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించే వారికి రెండున్నర దశాబ్దాలుగా పలు ప్రతిష్టాత్మక అవార్డులు ఇస్తున్న మోడరన్ ఫౌండేషన్ తాజాగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్‌కు ప్రజాహిత పురస్కారం అందజేసింది. ఫౌండేషన్ తరపున మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ ఈ పురస్కారాన్ని గురువారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవ సభలో అందజేశారు. ఈ సందర్భంగా జీవీ రావు మాట్లాడుతూ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే సుధాసాగర్ ప్రజా సమస్యలపై చురుగ్గా స్పందించి, పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులైన ఓటర్ల సౌకర్యార్థం తమ ఫౌండేషన్ తరపున 20 వీల్‌చైర్లు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మోడరన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియేట్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

రామచంద్రపురం: తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రామచంద్రపురం రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు గురువారం స్థానిక తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. పెన్షనర్లకు రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని, తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల రామకృష్ణారావు, తటవర్తి రాఘవరాజు, అంపోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆర్డీఓ సుధాసాగర్



రామచంద్రపురం ప్రధాన రహదారిపై ఓటర్ల అవగాహన ర్యాలీ



ఎన్నికల విధుల్లో ఉత్తమ సేవలందించిన బీఎల్‌ఓకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్



కె.గంగవరంలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్డీఓ, రామచంద్రపురం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్ సుధాసాగర్ చెప్పారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఆయన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పూర్తయిన యువత వెంటనే ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనాలని తెలిపారు, ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను సన్మానించారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న 18–19 ఏళ్ల వారిని అభినందించారు. వక్తృత్వ, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు, ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దొరరాజు, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, వివిధ శాఖల సిబ్బంది, కళాశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో విద్యార్థులతో తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ రెవెన్యూ సిబ్బంది ప్లకార్డుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రలోభాలకు గురికాకుండా, ప్రతిఒక్కరూ నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. పలు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది సీనియర్ ఓటర్లను సన్మానించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. అముజూరు ప్రాథమిక పాఠశాలలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొని, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

కాజులూరు: మండలంలోని గ్రామాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. మహిళలు ర్యాలీలు నిర్వహించారు. కాజులూరు, గొల్లపాలెం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

క్లుప్తంగా

పాఠశాలకు మెగాఫోన్ వితరణ



హెచ్‌ఎం ప్రసాద్‌కు మెగాఫోన్ అందించిన దృశ్యం

కె.గంగవరం: కోటిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు దాతలు మెగాఫోన్ అందజేశారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఐదో తరగతి విద్యార్థి గాలి హర్షవర్ధన్ తల్లిదండ్రులు బాలాజీ, దుర్గాదేవీలు సుమారు రూ.15 వేల విలువైన మెగాఫోన్‌ను హెచ్‌ఎం కేఆర్‌కే ప్రసాద్‌కు అందించారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు సమకూరుస్తోందని, దాతలు కూడా విద్యార్థుల సౌకర్యార్థం పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పట్నాల నాగబాబు, ఎస్ఎంసీ చైర్మన్ వై.సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు.

రిపబ్లిక్ డేకు ఏర్పాట్లు

రాయవరం: గణతంత్ర దినోత్సవానికి అన్ని సిద్ధమయ్యాయి. మండలంలో పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. గణతంత్ర వేడుకలు జరిపేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్నద్ధమయ్యారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు.

గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించనున్న 75వ గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం ఎనిమిది గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముమ్మరంగా కులగణన సర్వే

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో గురువారం కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సర్వే ప్రక్రియను పర్యవేక్షించారు. సచివాలయ ఉద్యోగులు సంబంధిత సాంకేతిక పరికరాలతో ఇంటింటికి వెళ్ళి సామాజికవర్గానికి చెందిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

కాజులూరు: గొల్లపాలెంలో శుక్రవారం జరగనున్న వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని ఎంపీపీ మాత భారతిమురళి అన్నారు. గ్రామంలో గురువారం ఆమె మాట్లాడుతూ గొల్లపాలెం వాటర్‌ట్యాంక్ ఆవరణలో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్యకర్తలు చేపట్టాల్సిన విధివిధానాలపై చర్చిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, స్థానికసంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

నేడు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని కరాచి సెంటర్‌లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో నెలకొల్పిన మహనీయులు బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్సీ తోట గురువారం విగ్రహాలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులతో కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జూపూడి ప్రభాకర్ రావు, జిల్లాకు చెందిన మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీలు చింతా అనూరాధ, నందిగం సురేష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరుకానున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కపిలేశ్వరపురం: పీజీటీల సమస్యలను పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు డిమాండ్ చేశారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలు ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీజీటీలకు ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలన్నారు. ఈనెల 28న అల్లవరంలో సంఘం 77వ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్ ఉమాపతిశాస్త్రి, జిల్లా నాయకులు నాయుడు శ్రీనివాసరావు, ఎన్వీ రమేష్ బాబు, నల్లా రామకృష్ణ పాల్గొన్నారు.